www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 04 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

## మెడికల్ మాయాజాలం..!



-మందుల ధరల్లో అసలు మర్మమేంటి...?
-తయారీ ధరకు ఎంఆర్‌పికి మధ్య సఎంత వ్యత్యాసం
-రోగి జేబుపై భారం పెంచుతున్న మందుల వ్యాపారం
-విధానపరమైన చర్యలకు రాష్ట్రాలకు సూచన

5 లో

## ఆధ్యాత్మిక వైభవానికి అల్లిపురం వేదిక



-టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం
- అమరావతిలోని ఆలయం తరహాలో నిర్మాణం
-ఈనెల 12న భూమిపూజ
-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మిగతా 2లో..

## నారాయణపురంలో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం



-రూ.200 కోట్లతో వైద్య సేవలు
-ట్రస్ట్‌కు మంత్రి పొంగులేటి అభినందనలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.200 కోట్లకు పైగా వ్యయంతో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఆసుపత్రిని పొంగులేటి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు పరీక్షలు, హెచ్‌పీవీ టీకాలు, ఉచిత వైద్య సహాయక కార్యక్రమాల ద్వారా గ్రామీణ, గిరిజన పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని, ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, క్యాన్సర్ నివారణ, ముందస్తు వ్యాధి నిర్ధారణ సేవలపై ట్రస్ట్ ప్రత్యేక దృష్టి సారించడం

మిగతా 2లో..

# పాలనలో సమన్వయ లోపం




-ఆర్థిక విషయంలో మంత్రులకు లేని స్వేచ్ఛ
-ముఖ్యమంత్రి రేవంత్ తీరు బాగున్నా ఎంపికలో పొరపాట్లు
-చట్టం అవినీతి పరులకు చుట్టమవుతుంది
-ఉద్యమాలకు యువతరమే పునాది
-ఓటు తొలగింపు నేరమే
-మీట్ ద ప్రెస్‌లో కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సమన్వయం లోపించిందని అది ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బాగున్నా అనేక అంశాలకు సంబంధించి ప్రాధాన్యత ఎంపికలో పొరపాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య మూలాలు దెబ్బతింటున్నాయని పునాదిగా నిలిచిన ఓటు హక్కును తొలగించడం నేరమేనని ఆయన స్పష్టం చేశారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో శనివారం మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని కూనంనేనితో ఖమ్మంలో నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ యువతరం ప్రజా ఉద్యమాలకు పునాదిగా నిలిచిందని నాటి స్వాతంత్రోద్యమం, సాయుధ తెలంగాణ పోరాటం, తెలంగాణ సాధనోద్యమం, పేదల పక్షాన కమ్యూనిస్టు పార్టీ సాగించిన అనేక పోరాటాల్లో యువతరమే ముందు నిలిచిందన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జన్‌జీ ఉద్యమించడంతో దిమాగి నక్సల్స్ పేరుతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సర్ పేరుతో ఓట్ల

మిగతా 2లో..

# ఆధ్యాత్మిక వైభవానికి అల్లిపురం వేదిక

**(మొదటిపేజీ తరువాయి)** తెలిపారు. భద్రాద్రి రాముడు కొలువై ఉన్న ఖమ్మం జిల్లాలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఖమ్మం నగరం లోని అల్లిపురం వద్ద టిటిడి ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్థలాన్ని శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ 20 ఎకరాల విస్తీర్ణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి కేటాయించిన భూమి విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందన్నారు. భూ సేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డిని మంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి ఎంతో భక్తిభావంతో ఆమోదం తెలిపారన్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు సహకారంతో ఆలయ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నమూనాలోనే అల్లిపురంలో ఆలయం నిర్మించనున్నట్లు తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో ఈనెల 12న అల్లిపురం వద్ద ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆలయం, స్వామి నారాయణ విద్యా సంస్థ తదితర నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దీనితో ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందడంతో పాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సహం లభిస్తుందన్నారు. పర్యాటక రంగానికి ఉపయోగపడేవిధంగా విశాలమైన పార్కింగ్ సౌకర్యంతో హరిత హోటల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఖమ్మం నగరానికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని ఆ కార్యాలయ నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని గుర్తించి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలన్నారు. ఖమ్మం నగరంలో చేపడుతున్న రోప్‌వే, కేబుల్ బ్రిడ్జి, మెడికల్ కళాశాల, మున్నేరు రిటైనింగ్ వాల్ తదితర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి పనులు ప్రారంభిస్తామన్నారు. అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చేలా భూమి పూజ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి సూచించారు. మీడియ ప్రతినిధులు ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ కార్పొరేటర్ రావూరి కరుణ, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, నాగండ్ల దీపక్ చౌదరి, కమర్తపు మురళీ, యలగొండ స్వామి, సాధు రమేష్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పాలనలో సమన్వయ లోపం

**(మొదటిపేజీ తరువాయి)** తొలగింపు నేరమని ప్రజాస్వామ్యానికి ఓటే మూలస్తంభమని దానిని తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడవడమేనన్నారు. 60 కోట్ల భోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతే లక్షల కోట్ల కుంభకోణాలు చోటు చేసుకున్న బిజెపి ప్రభుత్వాన్ని ఏవిధంగా శిక్షించాలని ఆయన ప్రశ్నించారు. జ్ఞానేష్‌కుమార్ దిగిపోవాల్సిందేనని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని కొద్ది మంది చేతుల్లో సంపద పోగుపడుతుందని ఆయన తెలిపారు. జర్నలిస్టులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్న సొమ్మును సరైన రీతిలో ఈ ప్రభుత్వానికి ఖర్చు చేయడం చేతకావడం లేదన్నారు. ఆర్థిక వ్యవహారాలు కేంద్రీకృతమవుతున్నాయని వివిధ శాఖల్లో ఖర్చు పెట్టే అవకాశం లేకుండా పోయిందని మంత్రులు స్వేచ్ఛగా పాలన చేసే పరిస్థితి లేదన్నారు. దీనితో కొత్త పంచాయతీలు పుట్టుకొస్తున్నాయన్నారు. కొన్ని హామీలు నెరవేర్చిన అది చెప్పుకునే పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదని సాంబశివరావు తెలిపారు. బొగ్గు దొంగతనం అన్న ప్రచారంలోనూ కాంగ్రెస్ నిజాలను ప్రజలకు వివరించలేకపోయిందన్నారు. ధరణి వల్లనే బిఆర్ఎస్ ఓడిపోయిందని ఇప్పుడు కాంగ్రెస్ కూడా సరైన రీతిలో వ్యవహరించకపోతే ముప్పు తప్పదన్నారు. ఏ ప్రభుత్వమైనా నిషేధిత జాబితాను కొనసాగిస్తారని కానీ చిన్న చిన్న పొరపాట్లు పెద్ద ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అనుభవదారు కాలాన్ని రద్దు చేయడం మళ్లీ భూ యజమానులకు ఊతమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకో సమర్థవంతంగా నడపలేకపోతుందన్న భావన వ్యక్తమవుతుందన్నారు. మిత్రపక్షంగా ఉన్న తమకు తెలపకుండానే మా అనుబంధ సంఘాన్ని ఆర్టీసి ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నం చేయడం ఓ మంత్రి కమ్యూనిస్టు సంఘాలను ఉద్దేశించి మాట్లాడటం ఇబ్బందికరమన్నారు. కమ్యూనిస్టు యూనియన్లను గెలవనివ్వవద్దన్న ఆయన తీరు సరి కాదని సాంబశివరావు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేయాలా ఎవరికి మద్దతు ఇవ్వాలా అన్న దానిపై ఇంకా నిర్ణయించలేదన్నారు. కొత్తగూడెం నియోజక వర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అన్ని నియోజక వర్గాల మాదిరి కొత్తగూడెంలో కూడా పర్యటిస్తే తప్పులేదు కానీ తరచూ పర్యటనలు చేయడం శత్రుపక్ష శాసన సభ్యుని పట్ల వ్యవహరించడం సరికాదన్నారు. అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్నారు. మిత్రపక్ష శాసనసభ్యుడు ఉన్న చోట అంతగా పట్టించుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. కమ్యూనిస్టుల నైతిక మద్దతు కాంగ్రెస్ గెలుపులో కీలక భూమిక పోషించిందన్నారు. ఆర్టీసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కమ్యూనిస్టులు విడివిడిగా పోటీ చేయడాన్ని ప్రస్తావిస్తూ కలిసిపోతే తప్ప రెండు పార్టీలు విడివిడిగా ఉన్నప్పుడు ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదన్నారు. ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు చేపట్టినప్పుడు మిత్రపక్షంగా సమర్థిస్తామని ప్రజలకు నష్టం జరిగే కార్యక్రమాలకు సంబంధించి ప్రశ్నించక తప్పదని ఆయన తెలిపారు. ప్రశ్నించే వారి పట్ల గత ప్రభుత్వం మాదిరే వ్యవహరిస్తూ ముందస్తు అరెస్టులు, ఆందోళనలు అణిచివేతలు చేస్తే గత ఫలితమే పునరావృతమవుతుందన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# నల్లమోతు పిచ్చయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి





-సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు

**ప్రజాపక్షం/ తల్లాడ :** నల్లమోతు పిచ్చయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు తెలిపారు. శనివారం తల్లాడ మండల పరిధిలోని పినపాక గ్రామంలో నల్లమోతు పిచ్చయ్య 37వ వర్థంతి నిర్వహించారు. ముందుగా స్థూపానికి జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు ఆవిష్కరించి మాట్లాడుతూ ఒక సిఎంని పినపాక గ్రామంలో ముట్టడి చేసి నలుమూలల్లో ఎటు బయటకు పోకుండా చేసినటువంటి సంఘటన ఆనాడు నల్లమోతు పిచ్చయ్య చేశారని గుర్తు చేశారు. వైరా కాలువను తీసుకురావడం కోసం పిచ్చయ్య చేసినటువంటి సేవలు మరిచిపోలేనిదన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసినటువంటి పనులు, ఇండ్ల స్థలాలు ఇవ్వడం, ఇండ్లు కట్టించడం వంటి కార్యక్రమాలతో ఆ గ్రామానికి కరెంటు తీసుకు వచ్చిన చరిత్ర కూడా పిచ్చయ్యకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జున్, జిల్లా నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, తడకమళ్ల యోబు, మద్దోజు శ్రవణ్‌కుమార్, రైతు సంఘం నాయకులు నల్లమోతు నర్సింహారావు, సీనియర్ నాయకులు తమ్మారపు వెంకటేశ్వర్లు, పిచ్చయ్య కుటుంబ సభ్యులు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణపురంలో

# క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం



అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి ద్వారా సత్తుపల్లితో పాటు మారుమూల గిరిజన ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ సునీల్ దత్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో హరితహారం



**ప్రజాపక్షం/ తల్లాడ :** అన్నారుగూడెం గ్రామాన్ని పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతీకగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ నేతృత్వంలో శనివారం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నారుగూడెం నుంచి తల్లాడ వైపు ఉన్న బిటి రోడ్డు ఇరువైపులా అన్నారుగూడెం రెవెన్యూ పరిధి వరకు 200కు పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. హరిత హారాన్ని మరింత విస్తరించి అన్నారుగూడెం పరిసర ప్రాంతాలను స్వచ్ఛమైన పచ్చని గ్రామంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. పచ్చదనం పెంపు, పారిశుధ్య పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

# స్మశానవాటికలో బోరు ఏర్పాటు



**ప్రజాపక్షం/ తల్లాడ :** అన్నారుగూడెం గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న అన్నారుగూడెం గ్రామ పంచాయతీ మరో కీలక చర్య చేపట్టింది. సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్షతన గ్రామంలోని స్మశానవాటిక లో నీటి వసతి కల్పించేందుకు బోరు వేయించే పనులు మొదలయ్యాయి. స్మశానవాటికలో నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బోరు ఏర్పాటు చేసినట్లు గ్రామ పంచాయతీ వర్గాలు తెలిపాయి. ఈ వసతి అందుబాటులోకి వస్తే అంత్యక్రియల సమయంలోనే కాకుండా స్మశానవాటిక పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణకు కూడా ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, వార్డు మెంబరు వంశీ, సీనియర్ నాయకులు, విలేజ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు నాదంపులి వెంకటనర్సయ్య, స్థానికులు పాల్గొన్నారు.

# సిరిపురం మేజర్‌కు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** సిరిపురం మేజర్ క్రింద సాగు చేస్తున్న రైతులకు తక్షణమే గోదావరి జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తల్లాడ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనకు బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు సంఘీభావం తెలిపారు. సిరిపురం మేజర్ అభివృద్ధి పనుల పేరుతో గత రెండు నెలలుగా సాగునీటి విడుదల నిలిచిపోవడంతో సుమారు 11వేల ఎకరాల ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నీటిని సిరిపురం మేజర్‌కు విడుదల చేసి పంటలను కాపాడాలని పలుమార్లు మంత్రులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. పంట చేతికి వచ్చే కీలక సమయంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్నా ప్రాంతానికి తల్లాడ ఎస్ఐ అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో బిల్లుపాడు గ్రామానికి చెందిన రైతులు మోహన్‌రావు, హన్మంతరావు, నర్సింహారావు, రమేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# బిజెపి తీరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం




**-కాంగ్రెస్ తీరు మార్చుకోవాలి**
**-ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం**
**-సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపి తీరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం ఏర్పడిందని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రాథమిక హక్కుగా ఉన్న ఓటు హక్కును తొలగించడం నేరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిజెపి మొత్తం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని అందుకే దేశ వ్యాప్తంగా ఓటు పరిరక్షణ పేరుతో ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ దేశంలో యువతలో ప్రశ్నించే తత్వం పెరుగుతుందని అందుకే ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని జన్‌జీ కూడా ఇందులో భాగమేనని ఆయన తెలిపారు. బిజెపి నేరాన్ని సైతం చట్టబద్ధంగా మార్చిందని దీని వల్ల దేశంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయన్నారు. కేవలం అతి కొద్ది మంది చేతుల్లో 90 శాతం సంపద పోగుబడిందని ఆయన ఆరోపించారు. కొంత మంది మేధావులు పేదలకు సంక్షేమంపై వితండ వాదం చేస్తున్నారు కానీ లక్షల కోట్ల రూపాయలు సంపన్న వర్గాలకు రాయితీల పేరుతో రద్దు చేస్తే ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. ఇప్పుడు చట్టాలు అవినీతి పరులకు చుట్టంగా మారాయని ఆయన తెలిపారు. వేతనాలు అతి తక్కువగా ఉండటం, ధరలు పెరుగుతుండటం ప్రజలను ఇబ్బందులు పెడుతుందని ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ తన తీరు మార్చుకోవాలన్నారు. ప్రజలకు జవాబుదారి తనం వహించడం లేదని కేవలం విపక్షాలపై దాడి మాత్రమే ప్రభుత్వ పని కాదన్నారు. ఆర్థికంగా లోటు ఉన్న ప్రజల సంక్షేమాన్ని విస్మరించరాదన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ ప్రభుత్వం విఫలమవుతుందన్న భావన ప్రజల్లో బలపడుతుందని ఆరు గ్యారెంటీల అమలుకు ఈ ప్రభుత్వం పూనుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 22ఎలో పేదలకు అన్యాయం జరిగితే సహించబోమన్నారు. ఈ నేపంతో దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకుంటే భూ పోరాటం తప్పదని కూనంనేని హెచ్చరించారు. పింఛన్ల పెంపు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో పాటు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టిసి ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ దాని మిత్రపక్షాల విజయం కోసం సిపిఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన సూచించారు. ప్రజా ఉద్యమ నిర్మాణంతోనే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సిసి రోడ్లు, డ్రైన్లు పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 15, 17 డివిజన్లలో నిర్మాణం పూర్తయిన సిసి రోడ్లు, డ్రైన్లను కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, నిర్మాణ పరిమాణాలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. డ్రైన్లలో నీరు సక్రమంగా ప్రవహించే విధంగా నిర్మాణం చేపట్టారా ఎక్కడైనా నీరు నిలిచే పరిస్థితి ఉందా అనేది పరిశీలించారు. ఇప్పటికైనా పూర్తయిన పనులకు సంబంధించి క్యూసి తనిఖీలు నిర్వహించారా లేదా అనే వివరాలను ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈఓ సమత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్‌గా కొమ్ము నరసింహారావుతోపాటు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నూతన ఛైర్మన్ నర్సింహారావు మాట్లాడుతూ..ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పాలకవర్గ సభ్యులతో సమన్వయంతో పని చేస్తామని, భక్తులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారానికి గాను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా , మండల అధ్యక్షులు నూతి సత్యనారాయణ, గుడిపూడి బుచ్చిరామయ్య హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# కెఎంసిలో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ అమలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగుల హాజరు నమోదులో మరింత పారదర్శకత, సమయ పాలన తీసుకురావడానికి కెఎంసి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ మొబైల్ ఫోన్లలో ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా ఫేస్ రికగ్నిషన్ ఆధారంగా హాజరు నమోదు చేసుకున్నారు. ఈ విధానం ద్వారా ప్రతి ఉద్యోగి ఏ సమయానికి విధులకు హాజరయ్యారు, ఏ సమయానికి విధులు ముగించుకుని వెళ్లారు అనే వివరాలు ఖచ్చితంగా నమోదు కానున్నాయి. దీనితో హాజరు నమోదులో పారదర్శకత పెరగడంతో పాటు ఉద్యోగుల్లో సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ మరింత మెరుగుపడుతుంది. ఉద్యోగుల హాజరు వివరాలను డిజిటల్ విధానంలో వివరించడం ద్వారా మ్యానువల్ అటెండెన్స్‌లో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి సమయాన్ని ఆదా చేయడంతో పాటు పరిపాలన వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానం ఉపయోగపడుతుంది. ఉద్యోగులందరూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను సక్రమంగా వినియోగిస్తూ నిర్ణీత సమయానికి విధులకు హాజరై తమ అటెండెన్స్‌ను నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

# చింతకాని ప్రెస్ క్లబ్ ఎన్నిక



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కాశిబోయిన రామారావు, పెరిక నాగేశ్వరరావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శనివారం చింతకాని మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశిబోయిన రామారావు(సాక్షి), ప్రధాన కార్యదర్శిగా పెరిక నాగేశ్వరరావు(మనతెలంగాణ) ను ఎన్నుకున్నారు. అ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ పై నమ్మకంతో తమను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ జర్నలిస్టుల సమస్యల కోసం పోరాడతామని, ఇండ్ల స్థలాల సాధనకోసం కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినంధించారు. ఈకార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు గార్లపాటి రమేష్, లింగం రాంబాబు, జర్నలిస్టులు కె రామారావు, పెరిక నాగేశ్వరరావు, అలవాల వెంకటనర్సయ్య, మందా శివకృష్ణ, డి ప్రవీణ్‌కుమార్, తూము నరసింహారావు, ఇంటి ప్రసాద్, చిట్టూరి నరేష్, పోతగాని పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# రుణ బకాయిలు చెల్లించండి

**డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ అధికారి కొండపల్లి శ్రీ రామ్**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలను మండల మహిళా సమాఖ్య నుండి పొందిన స్త్రీ నిధి రుణాలను జ్యాప్యం చేయకుండా చెల్లించాలని డి.ఆర్ .డి.ఏ ప్రాజెక్ట్ అధికారి కొండపల్లి శ్రీరామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పెనుబల్లి వెలుగు కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాలు సభ్యులు గతం లో ఏళ్ల తరబడి బకాయి పడ్డ అప్పులను తిరిగి చెల్లించి తద్వారా ఇతర సభ్యులు లబ్ధి పొందేలా డ్వాక్రా సభ్యులు సహకరించి రుణాలు చెల్లించాలని ఆయన సూచించారు. మండలంలో 1255 సంఘాలు ఉండగా అందులో 12 ,534 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ఇందులో బ్యాంకు లింకేజీ గతంలో 249 గ్రూపు సభ్యులు రుణాలు పొంది, సక్రమంగా చెల్లించలేదని ఆయన అన్నారు. స్త్రీనిధి రుణాలు సైతం 69 లక్షలు బకాయిలు ఉన్నాయని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. ప్రతి డ్వాక్రా గ్రూపు సక్రమంగా రుణాలు చెల్లిస్తే రుణాలను పెంచే అవకాశం ఉందని ఆయన అన్నారు. పతి మహిళ డ్వాక్రా గ్రూపుల ద్వా రా లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. గతంలో బకాయిలను బ్యాంకు లింకేజీ కి చెందిన 93 లక్షలు స్త్రీని దిగి చెందిన 15 లక్షలు రికవరీ చేయటం జరిగిందని అందుకు ఏపియం అభినందించారు. అదేవిధంగా మండల సమాఖ్యకు నిధులు డ్వాక్రా మ హిళల చెల్లింపులు ద్వారా సమకూర్చుకుంటే సంఘాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమీక్ష సమావేశంలో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ కె ఆంజనేయులు, ఏపీఎం సంపత్ కుమార్, సీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ మహోత్సవం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండలంలోని తాళ్లచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచి గడిపూడి వెంకటనారాయణ పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లల ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు ప్రతీరోజూ సమతుల్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవడంతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు శ్రీశాంతి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి , నవత, ఆశావర్కర్లునాగలక్ష్మి పాల్గొన్నారు.

# విద్యాశాఖాధికారికి పిఆర్‌టియు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/మధిర:** మధిర మండల విద్యాశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చెరుపల్లి శ్రీహరికి పిఆర్‌టియు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ శ్రీహరి మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టడం హర్షించదగిన పరిణామం అని వారి ఆధ్వర్యంలో మధిర మండల విద్యారంగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, రాష్ట్ర బాధ్యులు డి.వెంకటేశ్వరరావు, మధిర మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్, సీనియర్ నాయకులు కొలగాని ప్రసాదరావు, పిల్లి నర్సింహారావు, మధిర మండల బాధ్యులు నాగేశ్వరరావు, చేడే సతీష్, శ్యామలరావు, మల్లెల శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# తోట గౌతమ్ కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపులోని తోట గౌతమ్ కుటుంబానికి కళాశాల ప్రిన్సిపాల్ వేమా ప్రవీణ్ కుమార్, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు అందరూ కలిసి 57,650 రూపాయలు కలెక్ట్ చేసి శనివారం పోస్ట్ ఆఫీస్ నందు తోట జోష్ణ పేరు మీదుగా ఫిక్స్ డిపాజిట్ చేసి వారికి అందించడం జరిగింది. భవిష్యత్తులో తోట జోష్నాకు మరింత చేయుత నందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆధ్యాపకులు తిరుమలయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జిలుగు రత్నాకర్, కాషారావు, దుర్గా, శేషగిరిరావు, నాగేశ్వరరావు, శైలజా, ప్రియాంక, సుప్రియ, మోహన్ బాబు, హరీష్ బాబు, ప్రకాష్, సత్యావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలపై భారీగా పన్ను బకాయి..!

-ప్రతి సంవత్సరం చెల్లిస్తున్న నాలుగు కార్యాలయాలు
-21 కార్యాలయాల నుంచి వసూలు నిల్
-మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, వాటి అనుబంధ భవనాల నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్ను భారీగా బకాయి పడింది. మున్సిపాలిటీకి మొత్తం సుమారు రూ.20,88,717లు మేర పన్ను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు పలు ప్రభుత్వ కార్యాలయాలు బకాయిలను చెల్లించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మున్సిపాలిటీకి పన్నులు చెల్లించాల్సి ఉండగా, ప్రతి సంవత్సరం కొన్ని కార్యాలయాలు మాత్రం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పన్ను చెల్లిస్తున్నాయి. మద్యం డిపో, ఆర్‌టిసి బస్టాండ్, వ్యవసాయ మార్కెట్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలు మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే మరోవైపు వైరా మున్సిపాలిటీ సుమారు 21 ప్రభుత్వ కార్యాలయాలు, వాటి అనుబంధ భవనాలపై పన్ను బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తుంది.

బకాయిలకు సంబంధించిన వివరాలు పైన పట్టికలో చూడగలరు.

ఇలా పలు ప్రభుత్వ కార్యాలయాలపై ఏళ్లుగా పన్ను బకాయిలు పేరుకుపోతున్న నేపధ్యంలో మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**బకాయిల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి**

మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరుల్లో ఆస్తి పన్ను కూడా ఒకటి.

**మున్సిపాలిటీ లెక్కల ప్రకారం పలు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలకు సంబంధించి చెల్లించాల్సిన పన్ను వివరాలు ఇలా ఉన్నాయి..**

| కార్యాలయం పేరు | చెల్లించవలసిన పన్ను |
|---|---|
| 1) ఎన్ఎస్‌పి క్వార్టర్స్ | రూ.4,34,553 |
| 2) కోఆపరేటివ్ సొసైటీ కాంప్లెక్స్ | రూ.6,11,487 |
| 3) మత్స్యశాఖ కార్యాలయం, డెవలప్‌మెంట్ సెంటర్ | రూ.2,23,026 |
| 4) మోటార్ వెహికిల్ కార్యాలయం | రూ.1,18,221 |
| 5) కోఆపరేటివ్ గౌడాన్స్ | రూ.1,07,590 |
| 6) తహశీల్దార్ కార్యాలయం | రూ.1,07,814 |
| 7) కోఆపరేటివ్ సొసైటీ | రూ.92,730 |
| 8) విద్యుత్ సబ్‌స్టేసన్ | రూ.93,442 |
| 9) నీటిపారుదలశాఖ విశ్రాంతి భవనం | రూ.89,268 |
| 10) ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం | రూ.70,576 |
| 11) మండల పరిసత్ కార్యాలయం, క్వార్టర్స్ | రూ.45,585 |
| 12) ఆర్‌అండ్‌బి కార్యాలయం | రూ.36,231 |
| 13) నీటిపారుదలశాఖ కార్యాలయం | రూ.16,926 |
| 14) పిహెచ్‌సి, స్టాఫ్ క్వార్టర్స్ | రూ.10,134 |

సాధారణ ప్రజలు, వ్యాపార సంస్థల నుంచి పన్నుల వసూళ్లపై అధికారులు చర్యలు తీసుకుంటున్న సమయంలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలను కూడా వసూలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ శాఖలే పన్నులు చెల్లించకపోతే మున్సిపాలిటీ దాయంపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. బకాయి ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న పన్నును వసూలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పైసలు పెంచిన పగ

- స్నేహితుడి హత్యకు సుఫారీ
- ఐదుగురు నిందితుల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచకు చెందిన మానుపురి ప్రభాకర్, కేటిపిఎస్‌లో ఫోర్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్న పాల నాగేశ్వరరావులు మంచి స్నేహితులు. ఒకరంటే ఒకరికి చెప్పలేని అభిమానం. ఇద్దరు కలిసి టూర్‌లకు సైతం వెళ్ళేవారు. దీనితో ఇద్దరి మధ్యన విడదీయరాని బంధం పెనవేసుకొన్నది. ఈ క్రమంలో పాల నాగేశ్వరరావుకు ఆర్థిక పరమైన అవసరం ఏర్పడింది. దీనికి నేనున్నానంటూ ప్రభాకర్ ముందు కొచ్చాడు. నాగేశ్వరరావు అడిగిన 40 లక్షలు అప్పుగా ఇచ్చాడు. రోజులు గడుస్తున్నాయి. ఇచ్చిన అప్పు తీర్చాలని నాగేశ్వరరావును ప్రభాకర్ అడిగాడు. అనంతరం ఆర్థిక లావాదేవీలపై ఇద్దరి మధ్యన వాగ్వాదం జరిగింది. అయినా సరే ఇద్దరు కలిసి మెలిసి ఉంటున్నారు. దీనిని అలుసుగా తీసుకొన్న నాగేశ్వరరావుకు పైసలు ఎగ్గొట్టాలనే దుర్బుద్ధి కలిగింది. అదను కోసం ఎదిరి చూస్తున్నాడు. ఇది తెలియని ప్రభాకర్ తన స్నేహితుడితో ఎప్పట్లాగే ఉంటున్నాడు.స్నేహితుల మధ్యన జరిగిన ఆర్థిక లావాదేవీలు మనస్పర్థలు పెంచాయి. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడినందుకు పగ పెంచుకొన్న నాగేశ్వరరావు ఎలాగైనా ప్రభాకర్‌ను అంతమొందించి డబ్బులు ఎగ్గొట్టేందుకు పన్నాగం పన్నాడు. పైసలు పెంచిన పగ స్నేహితుడి హత్యకు సుఫారీ ఇచ్చి హత్య చేయటానికి దాడి చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను పాల్వంచ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. డిఎస్‌పి సతీష్ కుమార్ తెలిపిన ప్రకారం... పాల్వంచకు చెందిన మానుపురి ప్రభాకర్, కేటిపిఎస్‌లో ఫోర్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్న పాల నాగేశ్వరరావులు స్నేహితులు. నాగేశ్వరరావుకు ప్రభాకర్ 40 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. తిరిగి ఇవ్వమని అడినందుకు నాగేశ్వరరావు పగ పెంచుకొన్నాడు. ప్రభాకర్‌ను హత్య చేయటానికి నాగేశ్వరరావు తనకు పరిచయం ఉన్న కొత్తగూడెంకు చెందిన పెట్రోల్ బంక్‌లో పంపు ఆపరెటర్‌గా పని చేస్తున్న దాసరి రాజును సంప్రదించాడు. దీనికి కొత్తగూడెంకు చెందిన (కొత్తగూడెం వన్ టౌన్‌లో రౌడీ షీట్ కలిగిన) అరవ వినయ్ కుమార్ అనే వ్యక్తి ఉన్నాడని దీనికి సుమారు ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పి డీల్ కుదిర్చాడు. రెండు లక్షల నగదును ముట్టజెప్పారు. వీరితో పాటు ఎలగడ శివక్రిష్ణ, డాకూరి గణేష్‌లతో కలిసి ప్రభాకర్‌ను హత్య చేయటానికి పథక రచన చేశారు. ఉద్దేశ్యపూర్వకంగా ప్రభాకర్‌తో గొడవ పడి చంపేయాలని అనుకొన్నారు. దీనిలో భాగంగా ప్రభాకర్ కదలికలపై నిఘా పెట్టారు. పాల్వంచలో పలు మార్లు రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలో గత నెల 7వ, తేదీన మద్యాహ్న సమయంలో నాగేశ్వరరావు ప్రభాకర్‌కు ఫోన్ చేసి మద్యం తాగటానికి రావాలని కనకదుర్గ బార్‌కి పిలిపించుకొన్నాడు. ఇద్దరు కలిసి మద్యం సేవించారు. అప్పు త్వరలోనే చెల్లిస్తానని చెప్పి నాగేశ్వరరావు వెళ్ళిపోయాడు. అదే రోజు సాయంత్రం నాగేశ్వరరావు ప్రభాకర్‌కు ఫోన్ చేసి నీతో పని ఉందని మాట్లాడాలని ఎక్కడున్నావని ఫోన్ చేసి అడిగాడు. కనకదుర్గ బార్ వద్దనే ఉన్నానని ప్రభాకర్ చెప్పాడు. ఈ విషయాన్ని నాగేశ్వరరావు దాసరి రాజు తెలపగా అతను స్నేహితులకు తెలియజేయగా అందరు కలిసి బార్ షాపుకు చేరుకొని ప్రభాకర్ కోసం మాటు వేశారు. ఇంతలోనే బయటకు వచ్చిన ప్రభాకర్‌ను చూసిన వెంటనే ఒక్కసారిగా సోడా బాటిల్‌తో తలపై కొట్టారు. గమనించిన స్థానికులు గొడవను నిలువరించారు. అనంతరం స్టేషన్‌లో ప్రభాకర్ ఫిర్యాదు చేశాడు. విచారించిన పోలీసులు అరవ వినయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వినయ్ కుమార్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సిసి టీవి పుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. మరింత లోతైన దర్యాప్తును నిర్వహించారు. దీనితో అప్పు తీసుకొన్న నాగేశ్వరరావు ప్రభాకర్‌ను చంపేయాలని కుట్ర చేసినట్లుగా తెలిసిందని దీనితో అరవ వినయ్ కుమార్, ఎలగడ శివక్రిష్ణ, డాకూరి గణేష్, దాసరి రాజు, పాల నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకొన్నామని రిమాండ్‌కు తరలించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ సతీష్, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తోట నాగరాజు, అదనపు ఎస్ఐ పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీ పాఠశాలలో సేవా కార్యక్రమాలు



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులు, బూట్లు, బెల్టులు పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు టీవీని ఉచితంగా అందజేశారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, మండల విద్యాశాఖ అధికారి ఆర్ వీరస్వామిలను కూసుమంచి మండల గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కొండ కృష్ణవేణి, వైస్ సర్పంచ్ చెన్ను వెంకటరమణ, మాజీ \ ఎంపిటీసీ మాదాసు ఉపేందర్, వార్డు సభ్యులు ఆంతోటి వెంకన్న, చెరుకుపల్లి వీరయ్య, కొండ మహిపాల్, ఏఎపీసీ చైర్మన్ మంద మహేశ్వరి, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ అధ్యక్షుడు బయాన బాబురావు, పాఠశాల సిబ్బంది, మండల వనరుల కేంద్రం సీఆర్‌పీలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం :రేసు ఎల్లయ్య



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ కార్యదర్శి, ఆళ్లపల్లి ముద్దుబిడ్డ ఎస్‌కే సాబీర్ పాషా జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల మాజీ వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈసందర్భంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి ఎదిగిన సాబీర్ పాషా విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాడుతూ నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. ఆళ్లపల్లి ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి అండగా నిలుస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధుల సేవలకు గుర్తింపు




ప్రజాపక్షం/అశ్వాపురం: ఆరిఫా అరెడ్ రోషిని రీమా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు షహనాజ్ బేగంకు అంతర్జాతీయ శాంతి, ప్రతిభ పురస్కారం 2026 లభించింది. వంశీ ఈవెంట్స్ అండ్ మోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కింగ్‌కోటి తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ జాటో రామచంద్రనాయక్ చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. గత 15ఏళ్లుగా ఆదరణకు నోచుకోని వృద్ధులను చేరదీస్తున్న షహనాజ్ బేగం వారికి ఆహారం, వసతి, వైద్యసాయం అందిస్తున్నారు. కులమతాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న ఆమె కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, డాక్టర్ శ్రీనివాస్, జర్మన్‌టన్ హాస్పిటల్ అత్తాపూర్ నిర్వాహకులు డాక్టర్ ఇఫ్తికార్, నగర ప్రముఖులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## తుర్రవారిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

-నూతన గృహాలను ప్రారంభించిన ఎంఎల్‌ఏ పాయం





ప్రజాపక్షం/అశ్వాపురం: మండలంలోని తుర్రవారిగూడెం గ్రామ పంచాయితీలో లబ్ధిదారులు భానోత్ నరేష్, అచ్చమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. గృహాలను పరిశీలించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకుని పేదలు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అస్మిత సిటీ రగ్బీ లీగ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/కారేపల్లి: సెప్టెంబర్ 29న సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన అస్మిత సిటీ రగ్బీ లీగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 15 విభాగంలో రన్నరప్‌గా, అండర్ 18లో మూడో స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ డి సావిత్రి, ఉపాధ్యాయులు అభినందించారు. శిక్షణ అందించిన పీఈటీ, పీడీలును కూడా ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## తిరుపతి, వారణాసి సేవా సంకల్పయాత్రకు భద్రాచలంలో స్వాగతం



ప్రజాపక్షం/ఇల్లందు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి నుంచి వారాణాసీకి చేపట్టిన సేవా సంకల్ప యాత్ర భద్రాచలం చేరుకోగా టీడీపీ నియోజకవర్గ నేత ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సీతారామచంద్రస్వామి దర్శనం అనంతరం యాత్రికులు తదుపరి ప్రయాణం కొనసాగించారు. ఎస్ఏపీ చైర్మన్ రవినాయుడు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ తదితరుల ఆధ్వర్యంలో సాగుతున్న ఈ యాత్రలో 25 మంది బైక్ రైడర్లు పాల్గొంటున్నారు. అక్టోబర్ 8న వారాణాసీ చేరుకునేలా యాత్ర కొనసాగుతోంది. ముద్రగడ వంశీ మాట్లాడుతూ యాత్ర నిర్వాహకులు రవి నాయుడు, ప్రణవ్ గోపాల్‌ను అభినందించారు. రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. ఈకార్యక్రమంలో విజయవాడ కనకదుర్గ ఆలయ బోర్డు సభ్యురాలు హరిత, పొగాకు జయరాం, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, వార్డు సభ్యుడు మనుబోతుల అఖిల్, టీఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు దాసరి గోపాలకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు మనుబోతుల నరసయ్య, కంది రవి, దగ్గుల లింగయ్య, చెలిమల బాబు, మట్టల రత్నాకర్, గోగేలా రాజేష్, అప్పల రాజేష్, భాసాని నవీన్, భాస్కర్, మీరా ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ మాయాజాలం..!



-మందుల ధరల్లో అసలు మర్మమేంటి...?
-తయారీ ధరకు ఎంఆర్‌పికి మధ్య ఎంత వ్యత్యాసం
-రోగి జేబుపై భారం పెంచుతున్న మందుల వ్యాపారం
-పర్యవేక్షణ ఎంత వరకు..?
-ధరల నియంత్రణపై సుప్రీం కోర్టు దృష్టి
-విధానపరమైన చర్యలకు రాష్ట్రాలకు సూచన

ప్రజాపక్షం/ తల్లాడ : అనారోగ్యం వచ్చినప్పుడు వైద్యం తప్పనిసరి. వైద్యుడి సలహా మేరకు మందులు కొనుగోలు చేయడం కూడా తప్పని సరి.కానీ మందుల ధరల విషయంలో సాధారణ వినియోగదారుడికి పూర్తి అవగాహన లేకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తుంది. ఒక ఔషధంలోని వేర్వేరు బ్రాండ్ల ధరల్లో గణనీయమైన తేడాలు కనిపించడం ఆసుపత్రి ఫార్మసీల్లోనే మందులు కొనాల్సిన పరిస్థితులు, ఎంఆర్‌పికి సంబంధించిన అవగాహన లేకపోవడం వంటి అంశాలు రోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మందుల ధర వ్యవస్థల్లో షెడ్యూల్, నాన్ షెడ్యూల్ మందులకు వేర్వేరు నియమాలు ఉన్నాయి.

**16 శాతం రిటైలర్ మార్జిన్ ఎక్కడ వర్తిస్తుంది....?**

నేషనల్ ఫార్మా స్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఏ) ప్రకారం డిపిసివో క్రింద ధర నియంత్రణలో ఉన్న షెడ్యూల్ ఫార్ములేషన్ల ధర నిర్ణయంలో 16 శాతం రిటైలర్ మార్జిన్ పరిగణలోకి తీసుకుంటారు. నాన్ షెడ్యూల్ మందుల విషయంలో ధర నిర్ణయానికి భిన్నమైన విధానం ఉంటుంది. అందువల్ల ప్రతి మందుపై మెడికల్ షాపుకు 100 శాతం లేదా రెట్టింపు లాభం అనే వాదనను అన్ని మందులకు వర్తింపజేయడం వాస్తవ పరిస్థితిని ప్రతిభింభించదు.

**ఎంఆర్‌పి కంటే ఎక్కువ వసూలు చేస్తే....?**

మందు ప్యాక్‌పై ముద్రించిన (ఎంఆర్‌పి) వినియోగదారుని నుంచి వసూలు చేయగల గరిష్ట ధర సాధారణంగా మందును దాని కంటే తక్కువ ధరకు కూడా విక్రయించవచ్చు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అంతే కాదు రిటైలర్ మందుల ధరల జాబితాను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి. మందులు విక్రయించినప్పుడు రశీదు ఇవ్వడం కూడా తప్పనిసరి అని ఎన్‌పిపిఏ స్పష్టం చేస్తుంది.

**ప్రభుత్వ పర్యవేక్షణ ఎక్కడ...?**

మందుల ధరల విషయంలో కేంద్ర స్థాయిలో ఎన్‌పిపిఏ కీలక పాత్ర పోషిస్తుంది. డిపిసివో 2013 క్రింద అవసరమైన మందులకు సీలింగ్ ధరలు నిర్ణయించడం, ధరల పర్యవేక్షణ, నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలు ఉన్నాయి. 2026 జూన్ నాటికి ఎన్‌పిపిఏ 935 షెడ్యూల్ ఫార్ములేషన్లకు సీలింగ్ ధరలను నిర్ణయించినట్లు తన అధికారిక సమాచారంలో పేర్కొంది. రాష్ట్ర స్థాయిలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తదితర వ్యవస్థలు ధరలు, నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించాలి.

**సుప్రీం కోర్టు ఏమంది..?**

Siddharth Dalmia & Anr. v. Union of India & Ors కేసులో సుప్రీం కోర్టు 4 మార్చి 2025న ప్రైవేటు ఆసుపత్రుల ఫార్మసీలోల మందులు, వైద్య పరికరాలు, ఇతర వినియోగ వస్తువుల ధరల నియంత్రణకు సంబంధించిన అంశాన్ని పరిశీలించింది. పిటిషన్‌లో ఆసుపత్రులు తమ ఫార్మసీల నుంచే మందులు కొనాల్సిందిగా రోగులను ఒత్తిడి చేస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కోర్టు ప్రధానంగా ఇది విధానపరమైన అంశమని పేర్కొంటూ రోగులు లేదా వారి సహాయకులు దోపిడీకి గురికాకుండా తగిన విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించాలని సూచించింది. అదే సమయంలో ప్రైవేటు ఆరోగ్య రంగంలో పెట్టుబడులు, సేవల నిర్వహణపై కూడా సమతుల్య విధానం అవసరమని కోర్టు పేర్కొంది.

**ఆసుపత్రి ఫార్మసీ ప్రత్యేక సమస్య :**

సాధారణ మెడికల్ షాపుతో పోలిస్తే ఆసుపత్రిలో చేరిన రోగికి ఎంపికలు పరిమితం కావచ్చు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లి అదే మందును తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం లేకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ధరల పారదర్శకత మరింత ముఖ్యమవుతుంది. 2026లో సిసిఐకి సంబంధించిన ఒక కేసులో ఆసుపత్రి మందులు, వినియోగ వస్తువులను ఎంఆర్‌పి మేరకే విక్రయించినట్లు నమోదైంది. అయితే కొనుగోలు ధరతో అమ్మకపు ధరను మాత్రమే పోల్చి లాభాన్ని నిర్ణయించడం సరైన పద్ధతి కాదని కమిషన్ పేర్కొంది. నిల్వ, సరఫరా గొలుసు నిర్వహణ వంటి ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకోవాలని తెలిపింది.

**వినియోగదారుడి అప్రమత్తతే రక్షణ :**

మందు కొనుగోలు చేసేటప్పుడు ప్యాక్‌పై ఉన్న ఎంఆర్‌పి, తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్‌నెంబర్ పరిశీలించాలి. సాధ్యమైనప్పుడు బిల్లు తీసుకోవాలి. ఒకే ఉప్పు కలిగిన వేర్వేరు బ్రాండ్ల ధరలను వైద్యుడి సలహాతో పోల్చుకోవచ్చు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధర వసూలు చేసినట్లు అనిపిస్తే సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్‌పిపిఏ కూడా ధరల ఫిర్యాదులను స్వీకరిస్తుంది దాని Pharma Sahi Daam వ్యవస్థ ద్వారా ధరలను పరిశీలించే అవకాశం ఉంది. మందు అనేది సాధారణ వినియోగ వస్తువు కాదు. అది రోగి ప్రాణాలతో ముడిపడి ఉన్న ఔషధం. అందుకే మందుల ధరల్లో పారదర్శకత, సరైన బిల్లింగ్, ఎంఆర్‌పి అమలు, నాణ్యత పర్యవేక్షణ, ఆసుపత్రి ఫార్మసీలలో ధరల స్పష్టత వంటి అంశాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల్సిన అవసరం ఉంది. రోగికి వైద్యం అందాలి. మందు అందుబాటులో ఉండాలి, ధరలో పారదర్శకత ఉండాలి. ఇదే ప్రజా ఆరోగ్య వ్యవస్థకు ప్రాథమిక అవసరం.

## నకిలీ పింఛన్‌లపై విచారణ జరిపించాలి



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ పట్టణ పరిధిలో అర్హతలేని వ్యక్తులు కొందరు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి వృద్ధాప్య, వికలాంగుల పింఛన్‌లు తీసుకొంటున్నారని ఇలాంటి వాటినిపై తగు విచారణ జరిపించి అర్హులకు అందజేయాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాల్వంచలో వృద్ధాప్య, వికలాంగుల పింఛన్ మంజూరిలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఎలాంటి వైకల్యం లేని కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి దివ్యాంగుల పెన్షన్ పొందుతున్నారని, దీనితో పలువురు అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం క్యాంపులో వైద్యాధికారులు 25 నుండి 30 వేయిల వరకు ముడుపులు పుచ్చుకొని అనర్హులకు వికలాంగులకు చెందిన ధ్రువపత్రాలు ఇచ్చారని ఆరోపించారు. కేటిపిఎస్‌లో రిటైర్డ్ అయిన వారు కూడా వృద్ధాప్య పింఛన్‌లు తీసుకొంటున్నారని వీటిపై సమగ్ర విచారణ జరిపించి అనర్హులను తొలగించి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలోత్ ప్రశాంత్ నాయక్, కొత్తపల్లి విజయ, శాంపురి నాగేంద్రబాబు, అజ్మీరా హాథీరామ్, కోరదల రమేష్, శాంపురి పవన్, పండు తదితరులు పాల్గొన్నారు.

## రాయల సిద్దు అకాల మరణం

**పలువురు సంతాపం**



ప్రజాపక్షం/జూలూరుపాడు: సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ జూలూరుపాడు మండల కమిటీ సభ్యుడు, టీయుసిఐ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ రాయల సిద్దు శనివారం ఉదయం 8:30 నిమిషాలకు గుండెపోటుతో అకాల మృతి చెందారు. ఆయన మృతి చెందిన వార్త తెలుసు కున్నపలువురు రాజకీయ నాయకులు ఇంటికి చేరుకుని మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి ధర్మ పార్టీ జెండాను సిద్దు మృతదేహంపై కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీయుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎదులాపురం గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ మాట్లాడుతూ సిద్దు మరణం కుటుంబానికి, మాస్ లైన్ పార్టీ కీ తీరని లోటన్నారు. కార్మికుల సమస్యలపై, ప్రజా సమస్యలపై జరిగే పోరాటాల్లో సిద్దు తన వంతు పాత్రను పోషించేవాడని కొనియాడారు. చిన్న వయసులోని సిద్దు మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంతాప సభలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చాపలమడుగు రామ్మూర్తి, మాస్ లైన్ మండల కార్యదర్శి బానోత్ ధర్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల మీరా, న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి వల్లొజ రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చంగల గురునాథం, నివాళులర్పించారు.

**మృతికి సంతాపంగా బంద్, ప్రదర్శన..**

రాయల సిద్దు మృతికి సంతాపకంగా పార్టీ కార్యకర్తలు స్నేహితులు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా మండల కేంద్రంలో వ్యాపార సంస్థలను బంద్ నిర్వహించారు. అదే విధంగా మృతదేహాన్ని సిద్దు స్వగ్రామానికి తరలిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

## గర్భిణులకు సీమంతాలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల పరిధిలోని కొమ్ముగూడెం అంగన్వాడి సెంటర్లో ఐసిడిఎస్ 9వ మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రుగొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడి సెంటర్ సెక్టార్ అంగన్వాడీ టీచర్లు తయారుచేసిన గర్భిణీలకు సంబంధించిన బలవర్ధకమైన ఆహారాలను ప్రదర్శనలో ఉంచారు. గర్భిణీగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు తగిన విశ్రాంతి, నెల నెలా ఆరోగ్య పరీక్షలు, బిడ్డ ఎదుగుదల, తగిన వ్యాయామం లాంటి విషయాల గురించి గర్భిణీలకు వివరించారు. గర్భిణీ గా ఉన్న సమయంలో తగిన ఆహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డకు ఎలాంటి అనారోగ్యం రాదని బిడ్డ కనీసం రెండున్నర కిలోలు బరువుతో పుట్టాలని అంతకంటే తక్కువబరువుతో పుడితే బరువు తక్కువ బిడ్డగా పరిగణిస్తారని చెప్పారు. గర్భిణీగా ఉన్న సమయంలో బరువు ప్రతి నెల పెరుగుతున్నామా లేదా ఆకుకూరలు, కూరగాయలు పోషకాలు ఉన్న ఆహారాన్ని తింటున్నామా లేదా పరీక్షలు చేయించుకుంటున్నామా, లేదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఎత్తు తక్కువగా ఉన్న గర్భిణీలు అనారోగ్యంగా ఉన్న గర్భిణీలు. చిన్న వయసులో పెళ్లిళ్లు అయిన గర్భిణీలు గా ఉన్నవారు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ జ్యోతి గర్భిణీలకు సీమంతం జరిపించారు. మంచి ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని దీవించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ దీవ, హెడ్మాస్టర్, గ్రామ కార్యదర్శి సెక్టార్ అంగన్వాడిటీచర్స్ పాల్గొన్నారు.

## కోర్టు కేసుల పెండింగ్‌పై ఎస్పీ సమీక్ష

-పెండింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యు, సమన్లను త్వరగా పరిష్కరించాలి
-కోర్టు డ్యూటీ అధికారులకు ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలు



ప్రజాపక్షం/కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం కోర్టు డ్యూటీ అధికారులతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సమీక్ష నిర్వహించారు. కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలు, పరిష్కారంపై చర్చించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు, కోర్టు సమన్లను ప్రత్యేకంగా పర్యవేక్షించి త్వరగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌ఓలు, దర్యాప్తు అధికారులతో సమన్వయం చేసుకుని సీఆర్‌పీసీ 82,83కు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు, ఈ పెట్టీ కేసులను వారంవారీగా సమీక్షించాలని, ఈఎఫ్ఐఆర్, ఈ చార్జ్ షీట్ వివరాలను పరిశీలించి లోపాలు, పెండింగ్ అంశాలను వెంటనే సరి చేయాలని తెలిపారు. కోర్టు విచారణ వివరాలను ప్రతిరోజూ నమోదు చేసి ఆన్‌లైన్‌లో నవీకరించాలని ఆదేశించారు. వచ్చే సమీక్ష నాటికి పెండింగ్ అంశాలపై స్పష్టమైన పురోగతి ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈసమావేశంలో డీసీఆర్‌బీ సీఐ రాజు, కోర్టు లైజనింగ్ అధికారి రాఘవయ్య, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసులకు 9 పతకాలు

-క్రీడాకారులను అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు



ప్రజాపక్షం/కొత్తగూడెం: తెలంగాణ 5వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026 క్లస్టర్ సీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది 9 పతకాలు సాధించారు. ఇందులో 3 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. టెన్నిస్‌లో ఏఆర్ అదనపు ఎస్పీ ఈ విజయ్ బాబు డబుల్స్‌లో బంగారం, సింగిల్స్‌లో వెండి సాధించారు. ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, పాల్వంచ సీఐ కె సతీష్ ఓపెన్ డబుల్స్, 40ప్లస్ డబుల్స్‌లో బంగారు పతకాలు సాధించారు. కృష్ణారావు ఓపెన్ సింగిల్స్‌లో కాంస్యం, సతీష్ 40 ప్లస్ సింగిల్స్‌లో వెండి గెలుచుకున్నారు. బ్యాడ్మింటన్‌లో పీసీ జి ప్రవీణ్, డబ్ల్యూపీసీ కె నాగస్వరూప ఓపెన్ సింగిల్స్‌లో కాంస్య పతకాలు సాధించగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో వెండి పతకం దక్కింది. విజేతలను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు.

## ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌కు సన్మానం

-మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ మంద్రు రామకృష్ణ



ప్రజాపక్షం/అశ్వాపురం: సీతారామచంద్రస్వామి దర్శనానికి భద్రాచలం వచ్చిన ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవి నాయుడును నెల్లిపాక బంజర సర్పంచ్ మంద్రు రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ నెల్లిపాక బంజర గ్రామ పంచాయితీని మౌలిక వసతులు, పారిశుధ్యం, క్రీడా సదుపాయాలతో ఆదర్శపంచాయితీగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని, గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రవి నాయుడు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంపై రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

# నేడు రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు






**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు సంబంధించి మునుపెన్నడు లేని రీతిలో పోటీ నెలకొన్నప్పటికీ సేవాభావంతో వ్యవహరించి రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలను అందించిన వెలిగేటి చంద్రమోహన్ ప్యానెల్ వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన చంద్రమోహన్ ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీని అత్యుత్తమ సేవలతో ముందు వరుసలో నిలిపారు. జేడిగా వ్యవసాయ శాఖలో పదవి విరమణ చేసిన తర్వాత ఈ సమాజానికి సేవ చేయాలనే సదుద్దేశంతో విశ్రాంతిని వీడి సేవ బాట పట్టారు. తనదైన రీతిలో చంద్రమోహన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఐఆర్‌సిఎస్ ఛైర్మన్‌గా తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. ఆయన సేవలకు గాను రాష్ట్ర గవర్నర్ చేత ప్రశంసా పత్రాన్ని సైతం అందుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆపదల్లో ప్రకృతి వైపరీత్యాల్లో ఎనలేని సేవలను అందించింది. రెండు సార్లు రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బాధ్యతలు నిర్వహించిన ఆయన అధికారులను ఒప్పించి వీడియోస్ కాలనీలో రెడ్‌క్రాస్ సొసైటీకి ఒక భవనాన్ని సంపాదించగలిగారు. కరోనా కాలంలోనూ చంద్రమోహన్ నేతృత్వంలో రెడ్‌క్రాస్ అందించిన సేవలు ప్రశంసనీయం. 2024 వరదల సమయంలో మున్నేరు ముంపు బాధితులు 1500 మందికి రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. 1500 మందికి చేయూతగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆపదలో ఉన్న వారిని ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అందించడంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించడంలోనూ రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా సీనియర్ సీటిజన్స్, డేకేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రంలో పలు వసతులు కల్పించారు. రెడ్‌క్రాస్ సంస్థ కార్యక్రమంలో ఏడాది కాలంగా మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కల్పించారు. చంద్రమోహన్ ప్యానెల్ నుంచి 15 మంది పోటీలో ఉన్నారు. చంద్రమోహన్ ప్యానెల్‌ను మరోసారి గెలిపిస్తే రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు పొందే అవకాశం ఉంది. చంద్రమోహన్ ప్యానెల్ నుంచి అత్తులూరి గోవర్ధన్‌రావు 1, గజేంద్రుల నాగేశ్వరరావు 5 కాలువ శ్రీనివాస్ నందన్ 10, కొత్తా సత్యనారాయణరెడ్డి 16, కె. లింగమూర్తి 18, మూలగండ్ల శ్రీహరి 21, కేదాసు నర్సయ్య 23, టి. రాఘవయ్య 25, రాంమడుగు రవీందర్‌రావు 26, సాధినేని జనార్ధన్‌రావు 28, సాధినేని వెంకటేశ్వరరావు 29, పి. సుధాకర్ 32, జి. సూర్యప్రకాషరావు 33, డాక్టర్ ఎలిగేటి చంద్రమోహన్ 36, జిల్లా వెంకటేశ్వర్లు 37 నెంబర్లపై ఓటు వేయాలని చంద్రమోహన్ రెడ్‌క్రాస్ ఓటర్లకు తెలిపారు.

**-తొలిసారి రసవత్తర పోటీ**
**-చంద్రమోహన్ వైపే ఓటర్ల మొగ్గు**



# అక్రమ మైనింగ్‌పై మంత్రి తుమ్మల సీరియస్

**-అక్రమార్కులను అరెస్టు చేయండి**
**-అధికారులకు ఆదేశం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం అర్బన్ పరిధిలో వెలుగుమట్ల ప్రాంతంలో అక్రమంగా బెరైటీస్ ఖనిజాన్ని తవ్వి తరలిస్తుంటే ఏమి చేశారని ఆయన ప్రశ్నించారు. శనివారం అల్లిపురం సమీపంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మైనింగ్ అధికారులను పిలిచి అక్రమ మైనింగ్‌పై ప్రశ్నించారు. ఏఏ ప్రాంతాల్లో మైనింగ్ జరిగింది, ఎంత మేర తవ్వకాలు జరిపారు. ఇందుకు కారకులు ఎవరన్న దానిపై పూర్తి విచారణ చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇందుకు కారకులైన వారిని రెండు మూడు రోజుల్లో అరెస్టు చేయాలని ఆయన సూచించారు. విలువైన ఖనిజ సంపదను అనుమతులు లేకుండా ఎవురు తరలించినా శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. మీడియాలో అక్రమ మైనింగ్ పై వార్తలు వచ్చేంత వరకు మీరు ఎందుకు స్పందించ లేదని అధికారులను నిలదీశారు. దీనికి సంబంధించిన అక్రమార్కులను అరెస్టు చేసి తనకు నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

# మధిర 100 పడకల ఆసుపత్రిపై డిప్యూటీ కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ

**వైద్యులు సమయపాలనతో విధులు నిర్వహించాలి...గైర్హాజరైతే చర్యలు తప్పవు**



**ప్రజాపక్షం/మధిరః** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు జిల్లా డిప్యూటీ కలెక్టర్ శ్రీజ శనివారం మధిర పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పర్యవేక్షించారు. ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందితో సమావేశమైన వైద్యసేవలు, సిబ్బంది హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ వైద్యులందరూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా ఆసుపత్రిలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. విధులకు గైర్హాజరయ్యే వైద్యులపై గైర్హాజరు నమోదు చేసి, వెంటనే తనకు నివేదించాలని ఆసుపత్రి సూపరిండెంట్‌ను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరు, అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌ఫర్సన్ సామినేని సుజాత, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మధిర మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించడంతో పాటు వెంటనే అరెస్టు చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం సర్ పేరుతో ఓట్ల చోరీకి పాల్పడుతుందన్నారు. శనివారం యూనివర్సిటీ పిజి కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్‌యు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నాయకులు తుడుం ప్రవీణ్, చింతల రమేష్, గోకినేపల్లి మస్తాన్, లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జన్‌జీ యువత దేశ వ్యాప్తంగా పోరాడుతుందన్నారు. పోరాడుతున్న వారిపై పోలీసులతో దాడులు చేస్తూ నిర్బంధ కాండను ప్రయోగిస్తుందన్నారు. సర్ పేరుతో ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. రాజ్యాంగ బద్దంగా ఒక స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. మోడీ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని దేశ వ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించి ఓట్ల చోరీకి పాల్పడ్డారన్నారు. సర్ పేరుతో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ప్రధానంగా యువత ఓట్లను తొలగిస్తున్నారన్నారు. వెంటనే ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించి అరెస్టు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన సర్ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. ఇండియా కూటమి ప్రత్యామ్నాయ పౌర సమూహం (సిసిఏ), అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో అక్టోబర్ ఎనిమిదిన ఖమ్మంలో నిర్వహించే భారీ ర్యాలీలో విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు బొప్పి ఉమా, నాయకులు త్రినాథ్, కృష్ణప్రసాద్, గాంధీ, శ్రీకాంత్, సాగర్, సమీర్, మహేష్, వెంకటేష్, కార్తీక్‌రెడ్డి, సుమన్, చరణ్, సతీష్ పాల్గొన్నారు.

**-సర్ ప్రక్రియను నిలిపివేయాలి**
**-వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతల డిమాండ్**
**-వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ**

# సీనియర్ సిటిజన్ల హక్కులను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి



**ప్రజాపక్షం/మధిరః** సీనియర్ సిటిజన్ల హక్కులు, వారి సంక్షేమం, వారికి చట్టపరంగా అందుబాటులో ఉన్న రక్షణలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మధిర కోర్టు న్యాయమూర్తి దీప్తి వేముల అన్నారు. మధిరలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ల హక్కులపై మధిర పిఆర్‌టియు కార్యాలయంలో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్లు గౌరవించడం మన సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా వారికి చట్టం కల్పించిన హక్కులను పరిరక్షించడం కూడా ప్రతిఒక్కరి బాధ్యత అని న్యాయమూర్తి పేర్కొన్నారు. మైంటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 ద్వారా తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లకు కల్పించిన హక్కులను ఆమె వివరించారు. తమను తాము పోషించుకోలేని తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లుచట్టపరమైన నిబంధనల ప్రకారమనోవర్తి కోరవచ్చని తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్ల ఆస్తి హక్కులు,ఆస్తి బదిలీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలు, బంధువులద్వారా నిర్లక్ష్యంగా, వేధింపులు ఎదురైతే అందుబాటులో ఉన్న చట్టపరమైన పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్లు తమహక్కుల విషయంలో మౌనంగా ఉండకుండా, అవసరమైనప్పుడు పోలీసులు, సంబంధిత అధికార యంత్రాంగం న్యాయస్థానాలు, న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలని సూచించారు. వృద్ధులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, వారుకు కుటుంబాని, సమాజానికిఅందించిన సేవలను గుర్తించి, వారి వృద్ధాప్యాన్ని గౌరవప్రదంగా, భద్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వాసంశెట్టి కోటేశ్వరరావు, సీనియర్ సిటిజెన్, అసోసియేషన్ అధ్యక్షులు అబ్రహం, కార్యదర్శి రామబ్రహ్మాచారి, మాధవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆశామిత్ర లంకా కొండయ్యకు సన్మానం



**ప్రజాపక్షం/మధిరః** మధిర పట్టణంలోని వివిధ సంఘ సేవకులకు సలహాలిస్తూ అనేక సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా ఆరోగ్యశాఖలో తనదైన శైలిలో కళా ప్రదర్శనలు ఇస్తూ జన చైతన్యం చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్, జానపద కళాకారుడు లంకా కొండయ్యను గాంధి జయంతి సందర్భంగా స్థానిక టివిఎం హైస్కూల్‌లో టివిఎం ఈవినింగ్ వాకర్స్ క్లబ్, కోన సత్యనారాయణ గుప్త ఫౌండేషన్ సంయుక్తంగా లంకా కొండయ్యకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కోన నర్సింహారావు, పల్లపోతుల నర్సింహారావు, కోమిటిడి శ్రీనివాసరావు, విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కిలారు కామేశ్వరరావు, ఇంకా ఈవినింగ్ వాకర్స్ క్లబ్ సభ్యులు, మహిళామణులు, నైస్ టైలర్ షేక్ జాని, మీడియా మిత్రుడు వేముల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిరలో మహత్మాగాంధి ఉచిత పాత బట్టల కేంద్రం ఏర్పాటు చేసి అనేకులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయం అని, గాంధి జయంతి సందర్భంగా ఇలాంటి సంఘ సేవకుడిని సన్మానించుకోవడం ఆనందం అని అన్నారు. తన సేవలు గుర్తించి ఈ సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు కొండయ్య హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# చర్ల కాంగ్రెస్‌లో సర్పంచ్ రచ్చ



**- గెలిపించిన నేతలకు వెన్నుపోటు!**
**- లక్షలు ఖర్చు చేసి గెలిపిస్తే.. వైరి వర్గం గూటికి ?**
**- 'మహిళా' రిజర్వేషన్ స్థానాల్లో బెదిరింపు రాజకీయం**
**- ఆర్థికసాయం చేసిన నేతలకు హ్యాండ్!**

**ప్రజాపక్షం/చర్ల :** రాజకీయాలలో విశ్వసనీయత, విలువలు, నమ్మకం వంటి అంశాలకు ప్రాధాన్యత లేకండా పోయింది. చర్ల మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి అందులో 13 గ్రామ పంచాయతీలు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల వేడి చల్లారినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత వర్గపోరు మాత్రం పరాకాష్టకు చేరింది. పార్టీ గుర్తుపై ఎన్నికలు జరగకపోయినప్పటికీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో అభ్యర్థులు బరిలోకి దిగి భారీగా ఖర్చు చేశారు. అయితే, గెలిచిన కొంతమంది కాంగ్రెస్ సర్పంచులు ప్రదర్శిస్తున్న వైఖరిపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆర్థికంగా ఆదుకుని ఎన్నికలలో నిలబెడితే తీరా గెలిచాక సర్పంచ్‌లు నాయకులను మోసం చేయడం గమనార్హం. సర్పంచ్ ఎన్నికల వేళ ఆర్థిక స్తోమత లేని అభ్యర్థులకు పార్టీ ముఖ్య నేతలు లక్షలాది రూపాయలు సమకూర్చి విజయంలో కీలక పాత్ర పోషించారు. తీరా గెలిచిన వెంటనే ఆ సర్పంచులు తమను ఆదుకున్న నాయకులను కాదని, పార్టీలోని వైరి వర్గంతో చేతులు కలపడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లోనే ఉంటూ 'రెబెల్'గా మారిన కొందరు చోటా మోటా నాయకులు మైకుల ద్వారా ప్రచారం చేస్తూ, ఫలానా కాంగ్రెస్ నేతల పేర్లు బహిరంగంగా తెలియచేస్తూ వారి మద్ధతుతో బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థికే ఓటు వేయాలి'' అని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థుల ఓటమికి బహిరంగంగానే తీవ్ర యత్నాలు చేశారు. నాటి ప్రచారంతో ప్రజల్లో ఆదరణ లేని కారణంగా కాంగ్రెస్ అసమ్మతి వాదులకు పరాభవం పొందినా నేడు గెలిచిన సర్పంచులు మళ్లీ ఆ వైరి వర్గం వద్దకే చేరడం పట్ల ప్రజలు చీదరించుకుంటున్నారు.

**'చెక్ పవర్' రద్దు బెదిరింపులు:**

ఎన్నికల్లో తమను ఓడించేందుకు సర్వశక్తులూ ఒడ్డిన రెబెల్ నాయకులు, ప్రస్తుతం ఎమ్మెల్యే పేరు చెప్పి తమ వైపు రాకపోతే 'చెక్ పవర్' రద్దు చేయిస్తామని సర్పంచ్‌లను బెదిరిస్తున్నారని సదరు వర్గాల నుంచి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ కోసం నిలబడి, లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి గెలిపించిన నాయకులను మోసం చేయడం, నిన్నటి వరకు తమ ఓటమికి కుట్ర పన్నిన వర్గంతోనే గెలిచిన సర్పంచులు చేతులు కలపడంపై ఆయా గ్రామ పంచాయతీ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని సర్పంచ్ అభ్యర్థులను నమ్మి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు రూ.లక్షలాది రూపాయలు సమకూర్చి విజయంలో కీలక పాత్ర పోషించారు. తీరా గెలిచాక సర్పంచులు ప్లేటు తిప్పేయడంతో, నమ్మి సొమ్ము ఖర్చు చేసిన నాయకుల పరిస్థితి ''డబ్బు పోయే.. శని పట్టే'' అన్న చందంగా తయారైంది. పదవుల కోసం విశ్వసనీయతను త్యాగం చేస్తూ వర్గాలు మారడం, బెదిరింపుల రాజకీయాలకు పాల్పడటం వల్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు వాపోతున్నారు. బెదిరింపులకు భయపడి సర్పంచులు వర్గాలు మారడం కాకుండా, ప్రజా తీర్పును గౌరవించాలని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# సమగ్ర భూ రీ సర్వే మొదటి విడతగా ఐదు గ్రామాలు రీ సర్వే

**మధిర తహశీల్దార్ ఆఫీస్ నందు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ప్రత్యేక కేంద్రం**



**ప్రజాపక్షం/మధిర:** మధిర తహశీల్దార్ కార్యాలయంలో సమగ్ర భూ రీ సర్వే, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాపై తహశీల్దార్ రాంబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమగ్ర భూ రీ సర్వే మొదటి విడతలో భాగంగా తొండలగోపవరంలో 572 ఎకరాలు భూ రీ సర్వే పూర్తయిందని, ఇందులో 37.39 ఎకరాలకు సంబంధించి నూతనంగా పాస్ పుస్తకాలు మంజూరు చేయడం జరుగుతుంది అన్నారు. ప్రస్తుతం సిద్దినేనిగూడెంలో ఈ సర్వే చేస్తున్నట్లు తెలియజేశారు. తదుపరి నక్కల గరుబు, నాగవరప్పాడు, తొర్లపాడు గ్రామాల్లో ఈ సర్వే ఉంటుందని మధిర తహశీల్దార్ రాంబాబు తెలియజేశారు. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దీనివలన రైతులకు భవిష్యత్తులో భూమికి సంబంధించిన వివాదాలు ఉండవని ఆయన తెలిపారు. తదుపరి పట్టభద్రుదల ఓట్లు నమోదు ప్రక్రియ గత నెల 28 నుండి ప్రారంభమైందని తెలిపారు. నవంబర్ 6 వరకు ఓట్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మధిర మండలంలో గతంలో 3388 పట్టభద్రుదల ఓట్లు ఉన్నాయన్నారు. పట్టభద్రుదల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మధిర మండలంలో ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా మండలంలో 9394 ఓటర్లకు నోటీసులు జారీ చేయగా 8261 మంది ఓటర్లు సరైన పత్రాలు సమర్పించడంతో వారందరిని ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందన్నారు. మిగతా 1133 మంది ఓటర్లు ఎన్నికల కమీషన్ సూచించిన విధంగా సర్టిఫికెట్లు సమర్పిస్తే వారికి కూడా నమోదు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఓటర్లు ఫామ్ 18 ద్వారా గాని, ఆన్‌లైన్ ద్వారా గాని ఫారాలను పూర్తిచేసి ఎమ్మార్వో ఆఫీస్ నందు అందజేయాలన్నారు. ప్రతిఒక్క ఓటర్లు నవంబర్6వ తారీఖు లోపల అప్లై చేసుకోవాలని 2026కు ముందు మూడు సంవత్సరాలు అనగా నవంబర్ 2 2023 ముందు డిగ్రీ పూర్తి చేసిన వారందరూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు అర్హులు అని తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇళ్లలో సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సర్పంచ్‌లకు కనీస ప్రాధాన్యత కల్పించాలని రాజేశ్వరపురం సర్పంచ్ దండా రంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలని కోరారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచ్‌లకు కనీస ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని దండా రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి మంజూరయ్యే ఇళ్లలో కనీసం 10 శాతం ఇళ్లను సర్పంచ్‌లకు ప్రాధాన్యతగా కేటాయించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని మోటాపురం సర్పంచ్ ఏలూరి రామారావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతోందని, సమస్యను సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆరోపించారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. పంచాయతీ కార్మికులు కొన్ని చోట్ల ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మరికొన్ని ప్రాంతాల్లో రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించిన ఆయన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఎల్నినో ప్రభావం ఉందని చెబుతున్నప్పటికీ రైతులకు సబ్సిడీ విత్తనాలు అందడం లేదని సర్పంచ్‌లు ప్రశ్నించారు. రైతులకు అవసరమైన విత్తనాలను సకాలంలో అందించాలని కోరారు. వివిధ గ్రామాల్లో పంచాయతీలకు సంబంధించిన సమస్యలను సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. మండల సర్వసభ్య సమావేశానికి పలువురు సర్పంచ్‌లు, అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాల్సిన సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం కె.సురేందర్‌బాబు, ఈజీఎస్ ఏపీవో అమ్మజాన్, పీఆర్ ఏఈ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, సర్పంచ్‌లు కమదన ప్రవీణ్, పి.ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం ను తీసుకోవాలని కొత్తకొత్తూరు సర్పంచ్ మాళోత్ కవిత సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరు అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవం ను నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. దీని వలన రక్తహీనత, పోషకాహార లోపం ను నివారించవచ్చునని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, అంగన్వాడీ టీచర్ స్వాతి. ఆశా వర్కర్ సంధ్యా, గ్రామ పెద్దలు ఆయోధ్యరామయ్య, ఆయా, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్ వితరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థి నాగారపు మానసకు ల్యాప్‌టాప్ అందజేశారు. ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతు న్న నాగారపు మానసకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మద్దినేని ప్రసాదరావు, కమల ఆర్థిక సహాకరంతో రూ. 51వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల సమక్షంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ కన్వీనర్, టిఎస్‌జిఆర్‌ఈఏ రాష్ట్ర ఉపా ధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత చదువు చదివేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా ఆర్థిక సహకారం, ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. మరి కొంత మంది విద్యార్థుల చదువు పూర్తయ్యే వరకు సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చావా రమేష్‌బాబు, ఏపూరి నాగేశ్వరరావు, సిరిపురపు రమణారావు, డివిఎన్ ప్రసాద్, పూనాటి వెంకటేశ్వర్లు, మోత్కూరి పాపారావు, వి. జగన్‌మోహన్‌రావు, కె.రామస్వామి, బండారు కోటేశ్వరరావు, సయ్యద్ షఫీ పాల్గొన్నారు.

# స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర విద్యను అందించే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు బిఈడి (స్పెషల్ ఎడ్యుకేషన్) అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రఘునాథపాలెం పిఎంశ్రీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబరు ఎనిమిది సాయంత్రం ఐదు లోగా రఘునాథపాలెం పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో స్థానికత ఆధారంగా రఘునాథపాలెం మండలానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి మార్గదర్శకాల ప్రకారం విద్యార్హతల మెరీట్, స్థానికత ఆధారంగా తుది ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ధృవపత్రాల జిరాక్స్ కాపీలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఇంద్లాతండాలో కార్డన్ అండ్ సెర్చ్

**-గంజాయి, గుడుంబాపై సమాచారం ఇవ్వాలి : డీఎస్పీ వెంకన్నబాబు**





**ప్రజాపక్షం/ఇల్లందు:** ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకన్నబాబు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున కొమరారం గ్రామ పంచాయితీ పరిధి ఇంద్లాతండాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇల్లందు సబ్ డివిజన్ పోలీసులు, టీజీఎస్పీ సిబ్బంది కలిసి గ్రామంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. 30 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులకు మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. గంజాయి విక్రయాలు, నిల్వలు, గుడుంబా తయారీ లేదా విక్రయాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ సూచించారు. సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు విలువైన సమాచారం అందించిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని తెలిపారు. ఆపరేషన్‌లో సబ్ డివిజన్ పోలీసు అధికారులు, టీజీఎస్పీ సిబ్బంది కలిపి 60 మంది పాల్గొన్నారు.

# ఇది దొరల ప్రభుత్వం కాదు..

-ఎల్నినో ప్రభావం ఉన్నా తాగు, సాగునీరు, విద్యుత్ కొరత రానీవ్వం
-మొదటి విడతలో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి
-మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గత పాలకుల తరహాలో దొరల ప్రభుత్వం కాకుండా.. పేదల పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చ డంతో పాటు రైతులకు సాగునీటి భరోసా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మండ లంలోని కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.2.50 కోట్లతో వట్టికుంట వాగు వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కట్టుకాచారం చెక్‌డ్యామ్‌తో నేలకొండపల్లి మండలంతో పాటు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగు తుందని తెలిపారు. సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భరోసా లభిస్తుందని చెప్పారు. ఎల్నినో పరిస్థితుల్లో చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తికావడం రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. సాగు, తాగు నీటి వసతులు మెరుగుపడటంతో ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ తాగు, సాగునీ టికి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలి పారు. ఇటీవల వచ్చిన తుపాన్‌తో కొంత మేలు జరిగిందన్నారు. విద్యుత్ కొరత రానీయకుండా అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి



యూనిట్ రూ.12 చొప్పున విద్యుత్ కొనుగోలు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రత్యా మ్నాయంగా సౌర విద్యుత్ తదితర ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తు న్నామని తెలిపారు. విద్యుత్ కొరత పరిష్కారంపై ఇటీవల జరిగిన కేబి నెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు వెల్లడించారు. పేద, మధ్య తరగతి ప్రజల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేరుస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడ తలో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, రెండో విడత ఇళ్లను కూడా కేటాయించామని చెప్పారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్ష ఇళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. కట్టుకాచారం గ్రామంలో 35 నెలల్లో రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడేలా గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. ఇటీవల ఈ ప్రాంతంలో పర్య టించినప్పుడు చెక్‌డ్యామ్ వల్ల రైతులు సంతోషంగా ఉన్నట్లు గమనించా నన్నారు. సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. తక్కువ కాలంలోనే చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేశారని, ఎల్నినో పరిస్థితుల్లో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ వాసంతి, ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఆర్‌అం డ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ పొట్టయ్య, జేఈలు తాళ్లూరి నరేష్, షేక్ మదీనా, ఎం.రుత్విన్‌రెడ్డి, కె.కేతిరెడ్డి, దీక్షతా,ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుట్టబడి పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ పాఠశాల లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో లయన్స్‌క్లబ్‌శ్రీ ఎల్ల ప్పుడూ ముం దుంటుందని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. స్థానిక గుట్టబడి పాఠశాలకు లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యుడు, క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ గజ్జల కృష్ణమూర్తి తన పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్‌లను వితరణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు పెనుగొండ ఉపేంద్రరావు పాఠశాల అవసరాలను వివరించగా స్పందించిన గజ్జల కృష్ణమూర్తి ఫ్యాన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ఇటు వంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ల పాటి సీతారాములు మాట్లాడుతూ గజ్జల కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా లయనిజంతో అను బంధం కొనసాగిస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షులు కొల్ల రాబాబు, వుంద్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్, వనమా విశ్వేశ్వర రావు, నూకల శ్రీనివాసరావు, గజ్జల నర్సింహారావు, చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి సత్యంబాబు, కిరణ్, ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్రరావు, గరిడేపల్లి వాసు, శైలజ, కల్వలక్ష్మి, మొగలాబి, వాణిశ్రీ, దీప తదితరులు పాల్గొన్నారు. విద్యా ర్థులు, తల్లిదండ్రులు గజ్జల కృష్ణమూర్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## పీఎస్ఆర్ ట్రస్ట్ ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్న పూసల సీతారాములు తెలిపారు. ఇందులో భాగంగా కొత్తకొత్తూరు, రాయిగూడెం గ్రామాల్లో మృతిచెందిన పొడుగు సైదులు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహా యాన్ని అందజేశారు. రాయిగూడెం సర్పంచ్ బోయిన వేణు, సర్పంచ్ మాళోతు కళావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్యాషన్ ఫ్రూట్ ఆరోగ్యానికి ప్రకృతి వరం..!

-పండులో పోషకాలు -
ఆకుల్లో జీవక్రియలపై ప్రభావం చూపే పదార్థాలు





**ప్రజాపక్షం/ తల్లాడ :** ఇటీవలి కాలంలో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో కొత్త రకాల పండ్లపై ప్రజల ఆసక్తి పెరుగుతుంది. అందులో ప్యాషన్ ఫ్రూట్ (Passiflora edulis) కూడా ఒకటి. రుచితో పాటు వివిధ పోషకాలు, పాలీఫి నాల్స్, ఫ్లేవనాయిడ్స్ వంటి బయోయాక్టివ్ పదార్థాలు ఇందులో ఉన్నట్లు పరిశో ధనలు సూచిస్తున్నాయి. పండు, గింజలు, తొక్కతో పాటు మొక్కలోని ఆకులపై కూడా శాస్త్రీయ పరిశోధనలు జరిగాయి. అయితే ఈ పరిశోధనల ఫలితాలను సాధారణ ప్రజల ఆరోగ్య ప్రయోజనాలుగా నిర్ధారించడానికి ఇంకా పరిమిత ఆధారాలే ఉన్నాయి. ప్యాషన్ ఫ్రూట్‌లో ఆహారం, పీచు, విటమిన్లు, ఖనిజాలు, పాలీఫినాల్స్ వంటి పదార్థాలు లభిస్తాయి. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగిన సమ్మేళనాలు కూడా ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల సమ తుల ఆహారంలో భాగంగా పండును తీసుకోవడం ఆరోగ్యకరమైన ఎంపికగా ఉండొచ్చు. అయితే పోషక విలువలు పండు రకం, పక్వస్థితి, సాగు విధానం, నిల్వ పరిస్థితులపై మారవచ్చు.

### ఏ సమస్యల్లో ఉపయోగకరంగా ఉండొచ్చు :

ప్యాషన్ ఫ్రూట్ లోని బయోయాక్టివ్ పదార్థాలపై జరిగిన పరిశోధనల్లో ఆక్సిడే టివ్ స్ట్రెస్, వాపు, రక్తపోటు, రక్తంలో చక్కెర నియంత్రణ, కొవ్వు జీవక్రియ వంటి అంశాలపై ప్రయోజనకరమైన ప్రభావాల అవకాశాలు పరిశీలించబడ్డాయి. అయితే వీటిలో చాలా వరకు ప్రయోగశాల లేదా జంతు అధ్యయనాల ఆధా రాలు మాత్రమే.

### ఆకుల్లో ప్రత్యేకత ఏమిటి ..?

ప్యాషన్ ఫ్రూట్ ఆకుల్లో కూడా ఫ్లేవనాయిడ్స్, ఇతర ఫైటోకెమికల్స్ ఉన్నట్లు పరి శోధనలు సూచిస్తున్నాయి. ప్రయోగాత్మక అధ్యయనాల్లో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ తదితర జీవసంబంధ కార్యకలాపాలు పరిశీలించబ డ్డాయి. కొన్ని జంతు అధ్యయనాల్లో కాలేయ రక్షణకు సంబంధించిన ప్రభా వాలు కూడా కనిపించాయి. ఆకుల రసాయన కూర్పు మొక్క వయస్సు, రకం, పెరిగిన పరిస్థితులు, తయారీ విధానాన్ని బట్టి మారవచ్చు. ఆకుల కషాయం తాగితే కాలేయం, షుగర్, బిపి వంటి వ్యాధులు నయం అవుతాయని పలువురు ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

### ఆకుల వినియోగంలో ప్రమాదాలు :

ఆకులను పచ్చిగ తినడం, ఇంట్లో కషాయం లేదా టీగా తయారు చేసుకోవడం సురక్షితమని నిర్ధారించే ప్రమాణీకృత మోతాదు, తయారీ విధానం, నాణ్యత నియంత్రణపై తగిన సమాచారం లేదు. మొక్కలోని కొన్ని సమ్మేళనాలు అధిక మోతాదులో లేదా తప్పుగా తయారు చేసినప్పుడు హానీకరంగా ఉండే అవకాశం ఉంది. కలుషితాలు, పురుగుమందుల అవశేషాలు, తప్పు మొక్కను గుర్తించడం లేదా ఇతర మూలికలతో కలపడం వల్ల కూడా ప్రమాదం పెరగవచ్చు. నిద్రాహా రక ప్రభావం, తలతిరగడం, అలర్జీ, కడుపు అసౌకర్యం వంటి దుష్ప్రభావాలు రావచ్చు. లక్షణాలు కనిపిస్తే వెంటనే వినియోగం ఆపి వైద్య సహాయం పొందా లని నిపుణులు చెబుతున్నారు.

### ఎలా ఉపయోగించాలి :

పండును బాగా కడిగి నేరుగా తినడం లేదా గుజ్జును ఆహారంలో భాగంగా తీసు కోవడం సాధారణంగా సులభమైన మార్గం. ఈ పండును జ్యూస్‌గా తీసుకున్న ప్పుడు అదనపు చక్కెర కలపకుండా తీసుకోవడం మంచిది. ఆకులను కషాయం, టీ లేదా ఔషధ రూపంలో రోజు తీసుకోవడం ప్రారంభించే ముందు వైద్య నిపు ణుల సలహా తప్పనిసరి. ఎందుకంటే ప్యాషన్ ఫ్లవర్‌కు నిద్రాహారక ప్రభావం ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. నిద్ర మాత్రలు, ఆందోళన లేదా మూర్ఛకు ఉపయోగించే మందులు, మత్తు కలిగించే ఇతర ఔషధాలతో పరస్పర



చర్యలు ఉండే అవకాశం ఉంది. ఆకుల ఉత్ప త్తుల భద్రత, మోతాదు దీర్ఘకాలిక ప్రభావా లపై ఆధారాలు పరిమితంగా ఉన్నందున స్వయంగా మోతాదు నిర్ణయించకూడదు.

### ఎవరికి జాగ్రత్త అవసరం :

గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లలు, కాలేయం లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు, నిద్ర కలిగించే మందులు లేదా ఇతర క్రమం తప్పకుండా తీసుకునే మందులు వాడే వారు ప్యాషన్ ఫ్లవర్ ఆకుల ఉత్పత్తులను స్వయంగా ఉపయో గించకూడదు. మధుమేహం లేదా బిపి మందులు వాడే వారు కూడా ప్రత్యేక జాగ్రత్తవహించాలి. శస్త్ర చికిత్సకు ముందు అలాగే శస్త్ర చికిత్స అనంతరం కూడా వైద్యుడి సలహా అవసరం. నిద్ర, తలతిరగడం, అలర్జీ వంటి దుష్ప్రభావాలు రావ చ్చని ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. ఏదైనా మూలికా ఉత్పత్తి తీసుకునే ముందు దాని లేబుల్, పదార్థాలు, నాణ్యత ధృవీకరణను పరిశీలించాలి. ప్యాషన్ ఫ్రూట్‌ను మధుమేహం, బిపి, కాలేయ వ్యాధులు గుండె జబ్బులు లేదా ఇతర దీర్ఘ కాలిక వ్యాధులకు ప్రత్యామ్నాయ చికిత్సగా ఉపయోగించడం సరైంది కాదు. ఇప్పటికే మందులు వాడుతున్న వారు వాటిని నిలిపివేసి పండు లేదా ఆకులపై ఆధారపడకూడదు. ఆకుల కషాయం లేదా సప్లిమెంట్లను ప్రారంభించే ముందు తమ వైద్యుడికి సమాచారం ఇవ్వాలి. అవసరమైతే మందుల పరస్పర చర్యలు, రక్త పరీక్షలు , ఇతర ప్రమాదాలను వైద్యుడు అంచనా వేయగలరు.

### ఆరోగ్యకరమైన ఆహారంలో భాగం :

ప్యాషన్ ఫ్రూట్‌లో ఉన్న పోషకాలు, బయోయాక్టివ్ పదార్థాలు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే ఒక్క పండు అన్ని రోగాలను తగ్గిస్తుంది. అనే ప్రచారాన్ని నమ్మకుండా సమతుల ఆహారం, వ్యాయామం, అవసరమైన వైద్యపరీక్షలు, వైద్యుల సూచనలను పాటించడం ముఖ్యం. పరిశోధనల్లో కనిపించిన ప్రయోజనాలు సాధారణంగా నిర్దిష్ట సారాలు, మోతాదులు లేదా ప్రయోగ పరిస్థితులకు సంబంధించినవై ఉండ వచ్చు. వాటిని ఇంటి చిట్కాలకు నేరుగా అన్వయించకూడదు. ప్యాషన్ ఫ్రూట్ ఆరోగ్యానికి ఉపయోగపడే పండు కావచ్చు. కానీ అది అన్ని రోగాలకు మందు కాదు. ఆకుల వినియోగంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం. వైద్యుల సలహా లేకుండా వాటిని ఔషధంగా ఉపయోగించకండి.